ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
గురువారం 6 మార్చి 2025



నేడు మద్యం షాపులకు డ్రా

పార్వతీపురం టౌన్/పాలకొండ, మార్చి5(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం, సాలూరు, పాలకొండ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో గీత, సొండి కులాలకు కేటాయించిన నాలుగు మద్యం షాపులకు గురువారం డ్రా తీయనున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు ఈ ప్రక్రియ జరగనున్నట్లు పేర్కొన్నారు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ, వీరఘట్టంలో షాపులకు డ్రా తీయనున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులంతా సమయానికి హాజరు కావాలన్నారు.

కొండను కొల్లగొడుతున్నారు!

- తరలిపోతున్న కోట్లాది రూపాయల గ్రానైట్
- బడిదేవర కొండ వద్ద ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అనుమతులు పొందిన కాంట్రాక్టర్లు
- ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉందన్న అటవీశాఖ
- తవ్వకాలు మాత్రం కొనసాగింపు



బడిదేవరకొండ వద్ద గ్రానైట్ తవ్వకాలు జరిపిన దృశ్యం

గిరిజనుల ఆరాధ్యదేవత బడిదేవరమ్మ

ప్రస్తుతం గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని బడిదేవరమ్మ కొండగా పిలుస్తారు. పూర్వం నుంచి ఈ కొండ వద్ద గిరిజనులు సంప్రదాయ పద్ధతిలో బడిదేవరమ్మ దేవతకు పూజలు చేస్తూ.. మొక్కులు చెల్లిస్తారు. గత టీడీపీ ప్రభుత్వం కాలంలో గ్రానైట్ తవ్వకాలను హైకోర్టు రద్దు చేయడంతో ఈ ప్రాంతంలో అటవీశాఖ అధికారులను గిరిజనులు గౌరవించడంతో పాటు పెద్ద ఎత్తున పండుగ చేసుకున్నారు. అయితే వైసీపీ సర్కారు హయాంలో మళ్లీ తవ్వకాలు చేపట్టిన నాటి నుంచి వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే వారు ఆశలు పెట్టుకున్నారు. దీనిపై ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ స్పందించి తగు ఆదేశాలను జారీ చేయాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.



పార్వతీపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మండలం కోరి రెవెన్యూ పరిధి సర్వే నెంబర్-1లో బడిదేవర కొండ వద్ద గ్రానైట్ తవ్వకాలు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. కోట్లాది రూపాయల గ్రానైట్‌ను ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. వాస్తవంగా గ్రానైట్ తవ్వకాలకు అనుమతులు ఇచ్చిన ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉంది. అక్కడ ఎటువంటి తవ్వకాలు చేపట్టరాదని గత టీడీపీ ప్రభుత్వ కాలంలో అటవీశాఖాధికారులు హైకోర్టుకు వెళ్లారు. ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోనే ఉందని.. అటవీ, గనులు, రెవె న్యూశాఖల రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు నివేదికలు అందించారు. వాటిని పరిశీలించిన అనంతరం ఆ ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలు చేపట్టరాదని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. 2017లో జిల్లా గనుల శాఖ అధికారులు ఇచ్చిన అనుమతులను అప్పట్లో రద్దు చేసింది. దీంతో 2019 వరకు గ్రానైట్ తవ్వకాలు జరగలేదు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో సీన్ రివర్స్ అయింది.

ఇదీ పరిస్థితి..

కోరి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్-1లో రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతానికి చెందినది కాదని ఆ ప్రాంతాన్ని సర్వే ఆఫ్ ఇండియా ద్వారా సర్వే చేయించాలని కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. దీంతో సర్వే చేపట్టిన సర్వే ఆఫ్ ఇండియా గతంలో అధికారులు ఇచ్చిన నేదికలను పరిగణనలోకి తీసుకోలేదు. ఆ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో లేదని కోర్టుకు నివేదించింది. అయితే స్థానిక అటవీశాఖ అధికారులు అభిప్రాయం తీసుకుని కోరి రెవెన్యూ పరిధిలో గ్రానైట్ తవ్వకాలు చేపట్టాలని న్యాయస్థానం ఆదేశించింది. అయితే కాంట్రాక్టర్లు అటవీశాఖాధికారుల అభిప్రాయం తీసుకోలేదు. వైసీపీ ప్రభుత్వం కాలంలో పనిచేసిన జిల్లా ఉన్నతాధికారుల అనుమతులతో గ్రానైట్ తవ్వకాలను ప్రారంభించారు. దీంతో అటవీశాఖ ఒక్కసారిగా ఉలిక్కిపడింది. రిజర్వ్ ఫారెస్ట్‌లో గ్రానైట్ తవ్వకాలపై వారు ప్రశ్నిస్తే కోర్టు ఆదేశాలను అటవీశాఖాధికారులు ధిక్కరిస్తున్నారని కాంట్రాక్టర్లు ఆరోపణలు చేశారు. దీంతో కొంతకాలం పాటు అటవీశాఖాధికారులు మౌనం వహించారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గ్రానైట్ తవ్వకాలను

(మిగతా 8వ పేజీలో...)

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

- చిన్న జీయర్ స్వామి
- ఘనంగా శ్రీరామ పాదుకా పట్టాభిషేకం



7లో

హాజరైన భక్తులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న చిన్నజీయర్ స్వామి

ఏనుగుల సమస్యను పరిష్కరించండి

- అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రభుత్వ విప్ జగదీశ్వరి



కురుపాం/ గుమ్మలక్ష్మీపురం/ కొమరాడ, మార్చి5(ఆంధ్రజ్యోతి): పార్వతీ పురం మన్యం వాసులను దీర్ఘకాలికంగా వేధిస్తున్న ఏనుగుల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. గజరాజుల కారణంగా జిల్లావాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను బుధవారం ఆమె అసెంబ్లీలో ప్రస్తావించారు. 'మన్యం'లో మొత్తంగా 11 ఏనుగులు సంచరి స్తున్నాయని తెలిపారు. వాటివల్ల కురుపాం, పార్వతీపురం, పాలకొండ నియోజకవర్గాల్లో 12 మంది మృతి చెందారని, వేలాది ఎకరాల్లో పంటలను రైతులు నష్టపోయారని సభ దృష్టికి తీసుకొచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం ఏనుగుల సమస్యను పూర్తిగా గాలికొదిలేసిందన్నారు. ప్రస్తుతం జనావాసాల్లో, రహదారులపై గజరాజులు గుంపుగా సంచరిస్తుండడం వల్ల ప్రజలు ఇళ్ల వదిలి బయటకు రాలేకపోతున్నారని, పొలాలకు వెళ్లేందుకు కూడా సాహసించలేకపోతున్నారని తెలిపారు. వాహనదారులు కూడా రాకపోకలు సాగించలేకపోతున్నారని వెల్లడించారు. అవి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. దీంతో జిల్లావాసులు నిత్యం భయభ్రాంతలకు గురవుతున్నారని చెప్పారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించి ప్రజలకు గజరాజుల బెడద తప్పించాలని కోరారు. దీనిపై స్పందించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు సంబంధిత మంత్రికి ఈ విషయం తెలియజేస్తామన్నారు.

మహిళల భద్రతే లక్ష్యం: ఎస్పీ



ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి, ఏఎస్పీ తదితరులు

బెలగాం, మార్చి5(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా బుధవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. మహిళా సాధి కారత వారోత్సవాల్లో భాగంగా పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినులకు, చిత్రలేఖనం, వ్యాసరచన, క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు ఆర్థికంగా, రాజకీయ రంగాల్లో సాధించిన ప్రగతి , వారి హక్కులు, సమానత్వం, భద్రత, రక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. మహిళలు అత్యవసర సమయాల్లో ఈ 1098, 181 నెంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందొచ్చని సూచించారు. ఎలాంటి సమస్య వచ్చినా తమను సంప్రదించాలన్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. మహిళలపై నేరాల కట్టడికి పటిష్ఠ చర్యలు తీసుకుం టున్నామన్నారు. ఈ ర్యాలీలో ఏఎస్పీ అంకిత సురానా , ఐసీడీఎస్ పీవో టి.కనకదుర్గ, సీఐలు, ఎస్ఐలు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

శాసనసభలో మన వాణి

- గురుకులాల్లో సదుపాయాలు, 'వాటర్‌షెడ్' ప్రాజెక్టుపై ప్రస్తావించిన ఎమ్మెల్యేలు విజయచంద్ర, జయకృష్ణ

6లో

పంటలకు రక్షణగా మైకులు

- జంతువుల అరుపుల రికార్డింగ్
- రైతుల వినూత్న ప్రయోగం

అమ్మో.. దోమ

- విజృంభిస్తున్న వైనం
- నియంత్రణపై దృష్టి పెట్టని యంత్రాంగం

6లో



రైతులకు తీపికబురు

- సబ్సిడీపై సాగు పరికరాలు అందించనున్న ప్రభుత్వం
- తొలివిడత నిధులు కేటాయింపు
- 25లోగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశం



పార్వతీపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాయితీపై వ్యవసాయ పరికరాలు అందజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు తొలి విడతగా రూ.2.40 కోట్లును కేటాయించింది. ఈనెల 25 లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వాస్తవంగా గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం రైతులకు ఎటువంటి యంత్ర పరికరాలు అందించలేదు. రైతు సేవా కేంద్రం పరిధిలో గ్రూప్‌లుగా ఏర్పాటైన వారిలో వైసీపీకి చెందిన కార్యకర్తలు, నాయకులకు మాత్రమే రాయితీపై పరికరాలు అందించారు. దీంతో అర్హులైన అన్నదాతలు కొన్నాళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం సబ్సిడీపై సాగు పరికరాలు అందించేందుకు నిధులు మంజూరు చేయడంతో 'మన్యం'లో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాయితీపై అందించేవి ఇవీ..

జిల్లాలో అర్హులైన రైతులకు ఫుట్, బ్యాటరీ, పవర్ స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో నడిపే స్ప్రేయర్లు, దమ్ము సెట్‌లు ఇలా అనేక వ్యవసాయ పరికరాలను 50 శాతం సబ్సిడీతో అందించనున్నారు. కాగా ఐదు ఎకరాల లోపు భూమి కలవారు, చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులు, మహిళా రైతులు మాత్రమే వాటిని అందించనున్నారు. పట్టాదారు పాస్‌పుస్తకంతో పాటు ఈ-పంటలో నమోదు చేసుకున్న వారు, ఆర్వోఎఫ్ఆర్ భూములు సాగు చేస్తున్న రైతులు అర్హులుగా ప్రభుత్వం ప్రకటించింది. కుటుంబానికి ఒక లబ్ధిదారుడికి మాత్రమే సాగు పరికరాలు అందించనున్నారు. 'సబ్సిడీపై అందించే సాగు పరికరాల కోసం రైతు సేవా కేంద్రాల సహాయకులను అన్నదాతలు సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులకే యంత్రాలను అందిస్తాం.' అని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు.

ఆనందంగా ఉంది

చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం సబ్సిడీపై సాగు పరికరాలు అందించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయం. మాలాంటి రైతులపై ప్రభుత్వం దృష్టి సారించడం ఎంతో ఆనందంగా ఉంది.

- ఎల్.తిరుపతినాయుడు, రైతు, పార్వతీపురం

దరఖాస్తు చేసుకుంటాం

సబ్సిడీపై అందించే సాగు పరికరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటాం. అర్హులైనప్పటికీ గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ పరికరాలేవీ అందలేదు. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో మాకు మేలు జరగనుంది.

- అప్పలనాయుడు, రైతు పార్వతీపురం

'పది'లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ



వంటకాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీవో

కొమరాడ, మార్చి5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తర గతి విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదివి శతశాతం ఉత్తీర్ణత సాధించాలని పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ సూచించారు. బుధవారం పెదఖేర్జిల గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే పదో తరగతే పునాది అని తెలిపారు. శ్రద్ధతో విద్య నభ్యసించాలని.. పరీక్షలు బాగా రాసి మంచి మార్కులు పొందాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

రెండో విడతకు శ్రీకారం

- 31 గ్రామాల్లోని 28,967.11 ఎకరాల్లో రీ సర్వే ప్రారంభం
- తప్పుల్లేని రికార్డులే లక్ష్యంగా చర్యలు
- చురుగ్గా సాగుతున్న ప్రక్రియ

రీ సర్వే ఇలా...

- రెండో విడత రీసర్వేకు సంబంధించి జేసీ శోభిక ఆధ్వర్యంలో జిల్లా సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు తగు విధి విధానాలు సిద్ధం చేసి రెవెన్యూ, సర్వే సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. దీని ప్రకారం క్షేత్ర స్థాయిలో ప్రతి 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి ప్రతి రెవెన్యూ గ్రామాన్ని 3 నుంచి 4 బ్లాకులుగా ఏర్పాటు చేసి రీ సర్వే చేపట్టనున్నారు. దీనికి అవసరమైన టీములను పంపాలని తహసీల్దార్, సర్వేయర్లకు ఉన్నతాధికారులు ప్రొసీడింగ్‌లు ఇచ్చారు.
- రీసర్వేల్లో గ్రామ, బ్లాక్ విస్తీర్ణం, ప్రభుత్వ, అసైన్డ్ , వక్ఫ్, ప్రైవేట్, జిరాయితీ భూముల విస్తీర్ణాల నిగ్గు తేల్చాలి.
- రైతుల ఆధార్,

(మిగతా 8వ పేజీలో...)



సీతానగరం మండలం బల్లకృష్ణాపురంలో రీ సర్వే చేస్తున్న అధికారులు

జియ్యమ్మవలస, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల రీ సర్వే ఇష్టారాజ్యంగా సాగిన విషయం తెలిసిందే. రికార్డులన్నీ తప్పులు తడకలగా మారిన నేపథ్యంలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. వాటిని సవరించాలని కోరుతూ ఎప్పటికప్పుడు వారు అర్జీలు ఇస్తున్న నేపథ్యంలో కూటమి ప్రభుత్వం రీ సర్వేపై దృష్టి సారించింది. ఈ మేరకు జిల్లాలో మొదటి విడతగా పార్వతీపురం, పాలకొండ డివిజన్లలో 15 గ్రామాల్లోని 8,789 ఎకరాల్లో రీసర్వే పూర్తి చేశారు. ఇక రెండో విడతకు రెవెన్యూ, సర్వే శాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. రెండు డివిజన్లలో మరో 31 పైలెట్ గ్రామాల్లో రీ సర్వే ప్రారంభించారు.

ఎంపికైన గ్రామాలు..

- జిల్లాలో ఎంపిక చేసిన 31 గ్రామాల్లో 28,967.11 ఎకరాల్లో రెండో విడత రీ సర్వే చేపట్టనున్నారు. పార్వతీపురం డివిజన్ పరిధి.. బలిజిపేట మండలంలో అసరాడ, పలగర, కొమరాడలో పాలెం, విక్రంపురం, మక్కువలో కన్నంపేట, విజయరామపురం, పాచిపెంటలో పాచిపెంట, సరాయివలస , పార్వతీపురంలో తాళ్లబురిడి, బందలుప్పి, సాలూరులో బోరబంద, గరుగుబిల్లిలో సుంకి, వల్లరగొడబ, సీతానగరంలో దయానిధి పురం, బల్లకృష్ణాపురం గ్రామాల్లో 17,490.21 ఎకరాల్లో రీ సర్వే చేయనున్నారు.
- పాలకొండ డివిజన్ పరిధి.. గుమ్మలక్ష్మీపురం మండలంలో ఎల్విన్‌పేట, డోలుకోన , జియ్యమ్మవలసలో చినమేరంగి, మరువాడ, కురుపాంలో గుమ్మ, మొండెంఖల్, వీరఘట్టంలో యు.వెంకంపేట, కిమ్మి, పాలకొండలో తంపటాపల్లి, జంపరకోట, సీతంపేటలో నారాయణ దాసుపేట, మీనకోట, చిన్నతంకిడి, తుంగభద్ర, భామిని మండలంలో ఘనసర, లోహరిజాల గ్రామాలను ఎంపిక చేశారు. ఈ 16 గ్రామాల్లో మొత్తంగా 11,476.95 ఎకరాల్లో రీసర్వే చేయనున్నారు.




భామిని: ఘనసరలో రైతుల రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం

అమ్మో.. దోమ!

- విజృంభిస్తున్న వైనం
- నియంత్రణపై దృష్టి పెట్టని యంత్రాంగం
- ఎక్కడికక్కడే మురుగునీటి నిల్వలు


ఎలీవీస్ కార్యాలయం వెనుక వీధిలో..



రాజాం రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)

మన ఇంట్లోనే ఉంటూ... మనతోనే జీవిస్తూ... ఒక్కసారి కాటేసి... చేయాల్సినంత చేటు చేయడంలో దోమ చాలా దిట్ట. వీటి బారి నుంచి తప్పించుకునేందుకు లేపనాలు, కాయిల్స్ ఉన్నప్పటికీ అవేవీ వీటిని అడ్డుకట్ట వేయడంలో పూర్తి స్థాయిలో ఫలితాలనివ్వడం లేదు. ప్రజలు రోగాలబారిన పడుతున్నా అధికారులు, పాలకవర్గాలకు దోమ కుట్టినట్టు కూడా లేదు.

● ప్రమాదకరమైన దోమలివే..

జీవితకాలం 72 గంటలు మాత్రమే ఉండే దోమలు ప్రాణాంతక వ్యాధులకు ప్రధాన సూత్రధారులు. వ్యర్థాలు, మురుగునీటి నిల్వలున్న స్థలాలలో ఇవి సంతానోత్పత్తి చేస్తాయి. దోమలన్నీ హాని కలిగించేవి కావు. మనదేశంలో 60 రకాల ఎనాఫిలిస్ దోమలు ఉండగా... తొమ్మిది రకాల దోమల వల్ల మాత్రమే మలేరియా వ్యాప్తి చెందుతుంది. మన రాష్ట్రంలో 30 రకాల ఎనాఫిలిస్ దోమలు ఉన్నప్పటికీ కేవలం మూడు రకాలే వ్యాధి కారకాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎనాఫిలిస్ కులిసిఫేసస్, ఫ్లూవియటిక్ దోమ కాటు వల్ల మలేరియా, క్యూలెక్స్ దోమ కాటేస్తే ఫైలేరియా, ఏడిస్ మస్కిటో కాటేస్తే ఎల్లో ఫీవర్, డెంగీ, ఏడిస్ ఈజిప్ట్ దోమ కాటుతో గున్యా, జపనీస్-బి కారక దోమ కరిస్తే క్యూలిసైన్, మెదడువాపు వ్యాధి, సెరిబ్రల్ మలేరియా వంటి వ్యాధులు సంక్రమించే అవకాశాలున్నాయని రాజాం సామాజిక ఆసుపత్రి వైద్యాధికారి కరణం హరిబాబు స్పష్టం చేశారు.

● దోమ కుట్టినట్లయినా లేదు..

దోమల నివారణ పట్ల అధికార యంత్రాంగం బాధ్యతలను విస్మరిస్తున్నారు. జిల్లాలో విజయనగరం కార్పొరేషన్‌తో పాటు రాజాం, బొబ్బిలి మున్సిపాలిటీలు, నెల్లిమర్ల నగర పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదు. వీటితో పాటు చీపురుపల్లి, గరివిడి, ఎస్.కోట, గజపతినగరం, తెర్లాం, బాడంగి, పూసపాటిరేగ తదితర మండల కేంద్రాలలో కూడా పారిశుధ్యం పడకేస్తోంది. మేజర్ పంచాయతీలలో కూడా దోమల సంతతి నివారణకు చేపడుతున్న చర్యలు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ పేరుతో రికార్డుల్లో చూపిస్తున్న ఖర్చుకు... క్షేత్ర స్థాయిలో పరిస్థితులకు పొంతన ఉండడం లేదు.

● మరచిపోతున్నారు

దోమల నివారణకు యాంటీలార్వా నిర్మూలన చేపట్టాల్సి ఉంది. మురుగునీరు నిల్వలను నియంత్రించాలి. పారిశుధ్య ఎనులు చేపట్టాలి. రంపపు పొట్టుతో తయారు చేసిన మలాథియాన్‌లో నానబెట్టిన బంతులను దోమల ఉత్పత్తి కేంద్రాలలో వేయాలి. క్లోరినేషన్ చేపట్టాలి. కార్పొరేషన్, మున్సిపల్ కేంద్రాలలో నిత్యం ఫాగింగ్ చేయాలి. మలాథియాన్ పిచికారీ చేయాలి. ఇలాంటి చర్యలు మున్సిపాలిటీలలో అప్పుడప్పుడు కనిపిస్తున్నా, మేజర్ పంచాయతీలు, మండల కేంద్రాలలో లేదన్నది వాస్తవం.

● ప్రజల నిర్లక్ష్యం..

ప్రజల నిర్లక్ష్యం సైతం దోమల సంతతి పెరిగేందుకు, జనం రోగాలబారిన పడేందుకు మరో కారణంగా చెప్పక తప్పదు. మున్సిపాలిటీలలో పొడి, తడి చెత్తలను సేకరించే దిశగా శానిటరీ అధికారులు చర్యలు తీసుకుంటున్నా.. కాల్వల్లోనూ, రోడ్ల పక్కన వేయడం ద్వారా వీధులను మినీ డంపింగ్ యార్డులుగా మారుస్తున్నారు. అధికారులతో పాటు ప్రజలూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే దోమ కాటు నుంచి బయట పడవచ్చు.


కొరగంజి వీధి సమీపంలో మురుగు, చెత్త



ఇవేమి జ్వరాలు బాబోయ్!

- వేసవి ప్రారంభంలోనే ప్రతాపం
- అంతుపట్టని లక్షణాలు
- ఆస్పత్రులు కిటకిట

రాజాం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా వర్షాలు పడే సమయంలో జ్వరాలు వస్తుంటాయి. కానీ ఈసారి వేసవి ప్రారంభంలోనే ఉమ్మడిజిల్లాలో జ్వరాల తీవ్రత ఉంది. జ్వరపీడితుల్లో వింత లక్షణాలు కనిపిస్తున్నాయి. వీటిని చూసి వైద్యులే ఆశ్చర్యపోతున్నారు. జ్వరాలు అదుపులోకి రాకపోవడంతో వచ్చిన వారే మళ్లీ మళ్లీ ఆస్పత్రులకు వస్తున్నారని ప్రైవేటు వైద్యులు సైతం చెబుతున్నారు. గత కొద్దిరోజులుగా జిల్లాలో కనిపిస్తున్న జ్వరాలు వైద్యులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. వైరస్ కారణంగా జ్వరాలు వ్యాపిస్తున్నాయని చెబుతున్నా..వ్యాధికారక వైరస్ ఏమిటో తెలియడం లేదు. జ్వరాలు శరీరంలోని అన్ని అవయవాలపై ప్రభావం చూపుతుండడంతో భయపడిపోతున్నారు. గతంలో వచ్చిన వైరల్ జ్వరాలు మందులు వేసుకున్న మూడు, నాలుగు రోజుల్లో తగ్గిపోయేవి. కానీ ప్రస్తుతం వస్తున్న జ్వరాల ప్రభావం 7 నుంచి 10 రోజుల వరకూ ఉంటోంది. మొదటి రోజే శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీలకు చేరుతోంది. ఇన్‌ఫెక్షన్ తీవ్రత చూపే సీఆర్పీ (సీరియాక్టివ్ ప్రొటీన్) త్వరగా పెరిగిపోతోంది. ప్లేట్‌లెట్ల సంఖ్య వేగంగా పడిపోతోంది.

● పిల్లల్లో ఎక్కువగా..

పిల్లలు ఎక్కువగా జ్వరాల బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జ్వరం వచ్చిన వారు వెంటనే నీరసించిపోతున్నారు. జ్వర పీడితులకు వికారం, నీళ్ల విరేచనాలు, కీళ్ల నొప్పులు, నీరసం, దగ్గు, గొంతునొప్పి, కళ్ల మంటలు, ముక్కుకారడం, శరీరంపై దద్దుర్లు ఏర్పడుతున్నాయి. ప్రస్తుతం వేడిగా ఉండడంతో పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో ఏసీ వినియోగం అధికం. దీంతో వైరల్ జ్వరాలు వేగంగా విస్తరిస్తున్నాయి. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకూ జ్వరాల బారిన పడుతు న్నారు. గతంలో కొవిడ్ బారిన పడినవారిలో తీవ్రత అధికంగా ఉంది.

ఆస్పత్రుల్లో రద్దీ..

జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఆస్పత్రుల్లో ఒక్కసారిగా జ్వరపీడితులు పెరిగారు. సాధారణంగా రోజూ వందల సంఖ్యలో ఉండే ఓపీ వేలకు పెరిగింది. ఆస్పత్రులకు వచ్చిన వారే మరోసారి వస్తుండడం జ్వరాల తీవ్రతను తెలియజేస్తోంది. ఈ ఏడాది ముందస్తు అంచనాల్లో వైద్య ఆరోగ్య శాఖ విఫలమైంది. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు పేరుకుపోయి దోమలకు అవసాలుగా మారుతున్నాయి. కొందరిలో జ్వరం తగ్గుముఖం పట్టిన తరువాత తిరిగి రెండు మూడు రోజుల అనంతరం మళ్లీ వస్తోంది. వైరల్ జ్వరాల కారణంగా రక్తనాళల్లో నీరు తయారవుతోంది. జ్వరం తగ్గగానే ఊపిరితిత్తుల్లోకి ఆ నీరు చేరుతోంది. దీనినే ప్లాస్మా లీకేజీ అంటారని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం జ్వరం వచ్చి తగ్గిన బాధితులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. జ్వరం తగ్గిన 45 గంటల వరకూ క్రిటికల్ ఫేజ్ సమయమంటారు. ఈ సమయంలోనే ఎక్కువగా ఇబ్బంది పడుతున్న వారు ఆస్పత్రుల్లో చేరుతున్నారు.

● జ్వర పీడితులు పెరుగుతున్నారు..

జ్వరాల తీవ్రత అధికంగా ఉన్న మాట వాస్తవమే. మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో జ్వరాల తీవ్రత పెరుగుతోంది. వచ్చిన వారే మరోసారి ఆస్పత్రులకు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. గతానికి భిన్నంగా జ్వర లక్షణాలు కనిపిస్తున్నాయి. వీలైనంత వరకూ వేడినీరు తాగాలి. ఇంటి పరిసరాల చుట్టూ శుభ్రతను పాటించాలి.

-కరణం హరిబాబు, సూపరింటెండెంట్, రాజాం సామాజిక ఆస్పత్రి.

పంటలకు రక్షణగా మైకులు

- జంతువుల అరుపుల రికార్డింగ్
- రైతుల వినూత్న ప్రయోగం


లౌడ్‌స్పీకర్‌ను వినియోగిస్తున్న రైతు

పాలకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అడవి జంతువులు, పక్షుల నుంచి పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు కొత్త పద్ధతులను వినియోగిస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వీటితో కొంతమేర పంటల రక్షణ సాధ్యపడుతోందని అంటున్నారు. ఈ విషయంలో పాలకొండ మండలం ఓని గ్రామానికి చెందిన కనపాక ఉమామహేశ్వరరావు, కోట నందు అనే రైతులు ముందు వరుసలో నిలుస్తున్నారు. వీరు సుమారు పది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న కంకెలు గింజ కడుతున్నాయి. ఈ తరుణంలో రామచిలుకల బెడద అధికంగా ఉంది. ఇతర పక్షుల గుంపులుగా వచ్చి మొక్కజొన్న కంకులను తింటున్నాయి. దీనితో రైతులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వాటి బారి నుంచి మొక్కజొన్నకు రక్షణ కల్పించేందుకు ఈ ఇద్దరు రైతులు వినూత్నంగా ఆలోచించారు. ప్రస్తుతం మార్కెట్‌లో వీధి వ్యాపారాలు చేసేవారు లౌడ్ స్పీకర్లు, మైక్‌లలో తమ ఉత్పత్తుల గురించి వివరిస్తున్నారు. వారిని గమనించిన రైతులు పంట పొలాల్లో కూడా వినియోగిస్తే బాగుంటుందన్న ఆలోచనతో లౌడ్‌స్పీకర్లను పంట పొలాల్లో అమర్చారు. మనుషుల అరుపులు, డప్పు వాయిద్యాల ధ్వనులను పెన్‌డ్రైవ్‌లో లోడ్ చేసుకొని వాటిని అమర్చి ... శబ్దాలు చేయడం ద్వారా రామచిలుకలు, పక్షులు, అడవి పందులు, కుందేళ్లు తదితర వాటి నుంచి కొంత వరకు రక్షణ కలుగుతోందని అంటున్నారు. ఒక్కో లౌడ్‌స్పీకర్ ధర కంపెనీలను బట్టి రూ.500 నుంచి రూ.1000 వరకు ఉంటున్నాయి. మరో రూ.200 ఖర్చు పెట్టి వివిధ రకాల శబ్దాలను పెన్ డ్రైవ్‌లో లోడ్ చేసుకొని పంటల వద్ద శబ్దాలు వినిపించేలా ఏర్పాటు చేసుకోవచ్చునని రైతులు చెబుతున్నారు. ఒక లౌడ్ స్పీకర్ 8 నుంచి 12 గంటల వరకు చార్జింగ్ పెట్టిన తర్వాత పని చేస్తుందని చెప్పారు. ఇలా లౌడ్ స్పీకర్లు, మైక్‌ల ద్వారా ప్రస్తుతం మొక్కజొన్నను కాపాడుకుంటున్నామని ఆ రైతులు పేర్కొంటున్నారు. మరికొంతమంది రైతులు సీసాలకు గోనె సంచులు కట్టి వాటికి చిన్న రాయిపిక్కను వేలాడదీస్తున్నారు. గాలి వీచినప్పుడు రాయి గాజు సీసాకు రాపిడి జరగడంతో శబ్దం వస్తుంది. దీనితో కూడా కొంతమేర పంటల రక్షణకు సాధ్యమవుతుందన్నారు.


చెట్టుకు లౌడ్‌స్పీకర్ అమర్చిన దృశ్యం


శబ్దాల కోసం వినియోగిస్తున్న సీసా

చీర కట్టు.. పందుల ఆటకట్టు

పంటలను కాపాడుకోవడానికి కంచెలు వేయడం సాధారణమే. ఇక్కడో రైతు రంగురంగుల చీరలతో కంచె వేశాడు. అలా అయితే పందులు అటువైపు చూడవట. బొబ్బిలి మండలంలోని చిన అక్కేనవలస గిరిజన గ్రామంలో పొలాలు అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండటంతో అడవి పందులు రాత్రి సమయంలో స్వైరవిహారం చేస్తుంటాయి. మామూలు కంచె అయితే పచ్చగా కనిపిస్తుండడంతో నిత్యం చొరబడుతుంటాయి. కంచెకు రంగు రంగుల చీరలు కట్టడం వల్ల అక్కడ పంటలు లేవని, లోపల మనుషులు ఉండొచ్చునని భ్రమపడతాయట. ఈ ప్రాంతంలో టమాటా, మిర్చి. వంగ, బెండ తదితర కూరగాయల పంటలు విస్తృతంగా సాగు చేస్తున్నారు.

-బొబ్బిలి రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)



ఘనంగా కోదండరామ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు


ముర్రాటలతో గ్రామ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

సంతకవిటి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అక్కరాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన రమా సహిత సత్యనారాయణ స్వామి, కోదండ రాముని విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉదయం మహిళలు ముర్రాటలతో గ్రామ ప్రదక్షిణ చేశారు. అనంతరం వినాయక పూజ, పుణ్యాహవచనం, అగ్ని ప్రతిష్ఠ, అంకురారోపణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానికులతో పాటు పరిసర గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. దాదాపు 200 మంది శ్రీరామ దీక్ష తీసుకొని ఈ పూజల్లో పాల్గొన్నారు. పండితులు రంప కోదండ రామస్వామి, పులఖండం శ్రీధర్‌శర్మలు పూజలు చేశారు.

నేటి నుంచి జామి ఎల్లారమ్మ జాతర


జామి ఎల్లారమ్మ

జామి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన జామిలో కొలువైన ఉత్తరాంధ్రుల ఇలవేల్పు జామి ఎల్లారమ్మ తల్లి మూడు రోజుల జాతర గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా గురువారం రాత్రి గద్దె గుడిలో ఉన్న అమ్మవారిని వనంగుడికి తీసుకెళ్తారు. శుక్రవారం తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా నుంచి కూడా భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారు. శనివారం దమ్మిడీ తీర్థంతో జాతర ముగుస్తుంది. జాతరలో ఎటువంటి సమస్యలు రాకుండా 190 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేకంగా స్థలం కేటాయించామని సీఐ అప్పలనాయుడు తెలిపారు. భక్తులు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

శాసనసభలో మన వాణి

భీమసింగి కార్మికులను ఆదుకోండి..

● ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి



శృంగవరపుకోట, మార్చి 5 (ఆంధ్ర జ్యోతి): భీమసింగి చక్కెర కర్మాగార కార్మికులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి కోరారు. బుధవారం శాసనసభ సమావేశాల్లో ఈ అంశాన్ని ప్రస్తావించారు. 'భవిష్యత్‌లో ఎంఎస్ఎం ఈ పార్కుల ద్వారా ఈ చక్కెర కర్మాగారం పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టాలి. ఇందులో పని చేసిన కార్మికుల జీతాలను, పీఎఫ్‌ను చెల్లించాలి. గజపతినగరం నియోజకవర్గ పరిధిలో ఉన్న ఈ కర్మాగారం ఎస్.కోట, నెల్లిమర్ల, చీపురుపల్లి, విజయ నగరం, విశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గాలకు చెందిన చెరుకు రైతులకు జీవనాధారం. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవ హరించడంతో మూతపడింది. సుమారు 250 మంది ఉద్యోగులు, కార్మికులకు జీత భత్యాలను ఇవ్వకుండా కాలయాపన చేసింద'ని ఎమ్మెల్యే లలిత కుమారి ప్రస్తావించారు.

రోడ్డు సౌకర్యంపై దృష్టి పెట్టండి..

● ఎమ్మెల్యే లోకం నాగమాధవి



భోగాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): భోగాపురం ఇంటర్నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుకు మెరుగైన కనెక్టివిటీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి కోరారు. బుధవారం శాసన సభలో ఆమె మాట్లాడుతూ... ముక్కాం నుంచి చాకివలస, దిబ్బలపాలెం నుంచి సవరవల్లి, పోలిపల్లి నుంచి మోదవలస, భైరెడ్డిపాలెం నుంచి సబ్బన్నపేట, కంచేరు నుంచి రామచంద్రపేటకు రహదారులు నిర్మించాలని కోరారు. దీని వల్ల ఎయిర్‌పోర్టుకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందన్నారు. పారిశ్రామిక అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

'వాటర్‌షెడ్' ప్రాజెక్టును విస్తరించండి..

● ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ



పాలకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సీతంపేట మండ లానికి 2014-2019 మధ్యకాలంలో ఇంటిగ్రేటెడ్ వాటర్‌షెడ్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు మంజూరైందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. అసెంబ్లీలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు చిన్న, సన్నకారు రైతులకు ఎంతో ఉపయోగపడిందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దీనిని నిలిపివేశారని తెలిపారు. ఈ ప్రాజెక్టును గిరిజన ప్రాంతాల్లోనే కాకుండా మైదాన ప్రాంత రైతులకూ లబ్ధి కలిగే విధంగా విస్తరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

గురుకులాల్లో సదుపాయాలు కల్పించండి

● ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం, మార్చి 5 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలోని గురుకుల పాఠశా లల్లో మౌలిక వసతులు కల్పించ డంపై శ్రద్ధ వహించాలని పార్వతీ పురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రభుత్వా న్ని కోరారు. బుధ వారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు గురుకుల విద్యాలయాలను ప్రారంభించారని గుర్తు చేశారు. ఒకప్పుడు గురుకుల పాఠశాలల్లో సీటు దొరకాలంటే చాలా కష్టంగా ఉండేదని గుర్తు చేశారు. దీనికి కారణం మౌలిక వసతులు పూర్తి స్థాయిలో ఉండడమేనని అన్నారు. ప్రస్తుతం మౌలిక వసతులు అంతంతమాత్రంగానే ఉంటున్నాయన్నారు. దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

ఒడిశాకు వెళ్లే రహదారులను అభివృద్ధి చేయండి

● ఎమ్మెల్యే బేబీనాయన



బొబ్బిలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒడిశా- ఉత్తరాంధ్రలకు అనుసంధానంగా ఉన్న రహదారి అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించాలని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. బుధవారం శాసన సభలో ఆయన మాట్లాడారు. రాయగడలోని మజ్జి గౌరమ్మ ఆలయం ప్రసిద్ధమైన యాత్రా స్థలం కావడంతో ఈ రహదారిలో నిత్యం రద్దీ అధికంగా ఉంటుందన్నారు. దీనిని అభివృద్ధి చేస్తే రెండు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

● మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విజయనగరం కలెక్టరేట్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఈ నెల 8న జిల్లాలో ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర మహిళా స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ఆమె మాట్లాడారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో జరిగే రాష్ట్రస్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాన్ని లైవ్ టెలికాస్ట్ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ప్రజాప్రతినిధులు అందరినీ ఆహ్వానించాలన్నారు. పేదరికం నుంచి వచ్చి గొప్పవారైనా మహిళలను సత్కరించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ అంబేడ్కర్, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి, ఐసీడీఎస్ పీడీ ప్రసన్న, డీఎంహెచ్‌వో జీవనరాణి పాల్గొన్నారు.

8న మహిళా దినోత్సవం



వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలో ఈ నెల 8న మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అధికారులను ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. బుధవారం మహిళా పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. స్టేషన్‌ను ప్రాంగణంతో పాటు మహిళా దినోత్సవ ముగింపు వేడుకలను పరిశీలించారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నర్సింహమూర్తి, లీలారావు, ఆర్‌వీఆర్‌కె చౌదరి, ఎస్‌ఐ నర్సింగరావు ఉన్నారు.

200 రోజులు పని కల్పించండి

నెల్లిమర్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనదారులకు 200 రోజుల పని కల్పించాలని రైతు సంఘం నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కొత్తపేటలో జగ్గయ్య చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వేతన దారుల సమస్యలను తెలుసుకున్నారు. ఎనిమిది వారాలుగా వేతనాలు చెల్లించకపోతే వారు ఎలా జీవిస్తారని అధికారులను నిలదీశారు. పనిప్రదేశంలో టెంట్లు, మందుల కిట్లు లేవని, ఏమైనా జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు.

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయండి

నెల్లిమర్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ, గ్రాట్యూటీ అమలు చేయాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఆర్ పాలసీ, గ్రాట్యూటీ అమలు, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు అకౌంటెంట్ రామకృష్ణ, ఆపరేటర్ భారతి, ఐఈఆర్టీలు అప్పలనాయుడు, పురుషోత్తమనాయుడు, సీఆర్‌పీలు బి.వి.రమణ, ఎం.అచ్చంనాయుడు, వి.ఈశ్వరరావు, జి.లక్ష్మణరావు, ఎం.రేవతి పాల్గొన్నారు.

రేపు ఎల్లమ్మ జాతర

రాజాం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సిర్లి పోతన్న, ఎల్లమ్మ జాతర మహోత్సవం శుక్రవారం జరుగుతుందని నిర్వాహకులు బుధవారం తెలిపారు. ఉదయం ఉంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. సాయంత్రం 5 గంటలకు అగ్నిగుండం తొక్కే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

క్రీస్తు సందేశం ప్రారంభం

విజయనగరం బాబామెట్ట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక స్విమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో క్రీస్తు మరణానికి ముందు ప్రారంభమైన శ్రమలకు ముందురోజైన భస్మ బుధవారం భక్తిశ్రద్ధలతో క్రీస్తు సందేశాలను ప్రారంభించారు. బైబిల్‌లో పలు అధ్యాయాలను పాస్టర్ వై.ప్రభాకర్ బోధించారు. ఈ కార్యక్రమం 40 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ప్రతిరోజు భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని దేవుని ఆశీర్వాదం పొందాలని నిర్వహకులు సంఘ మిత్ర ఆర్‌ఎస్ జాన్ తెలిపారు.

పీఆర్‌టీయూ సంబరాలు

చీపురుపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించడంతో చీపురుపల్లిలో బుధవారం పీఆర్‌టీయూ సంఘ ప్రతినిధులు సంబరాలు చేసుకున్నారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో స్థానిక ఎంఆర్‌సీ వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, ఆర్.రాము, ఎస్.సన్యాసిరావు, ఎం.జగన్నాథం, భారతి, అల్తి వెంకటమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

కొత్తవలస, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శత శాతం ఇంటిపన్నులు వసూలు చేయడానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన కొత్తవలసలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి నెలాఖారు నాటికి పన్ను బకాయిలు వసూలు చేయాలని ఆదేశించారు.

నిర్వాసితుల గుర్తింపునకు రీసర్వే

వేపాడ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విశాఖ-అరకు జాతీయ రహదారి నిర్మాణంలో నష్టపోయే నిర్వాసితుల జాబితా గుర్తింపునకు మండల రెవెన్యూ సిబ్బంది బుధవారం రీ సర్వే నిర్వహించారు. గతంలో నిర్వహించిన సర్వేలో చాలామంది తప్పిపోయారని రీసర్వే నిర్వహించాలని బొద్దాం, పాటూరు గ్రామాల వారు ఆందోళన చేపట్టడంతో పాటు బాధితులు ఆర్డీవో కీర్తికి వినతిపత్రాలు అందజేశారు. దాంతో ఆమె స్పందించిన రీసర్వేకు ఆదేశించారు.

భూఆధార్ చేసుకోండి

గరివిడి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు భూఆధార్ కార్డులకు ఈనెల 10లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి విటి.రామారావు సూచించారు. బుధవారం మండలంలోని సువ్వాంలో ఆయన పర్యటించారు. రైతులతో మాట్లాడుతూ భూఆధార్ వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయనతో పాటు వ్యవసాయశాఖ ఏడీ ఎన్.కోటేశ్వరరావు, ఏవో శైలజ ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే సతీమణి మృతి

గుర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ఎమ్మెల్యే పొట్నూరు సూర్యనారాయణ సతీమణి పొట్నూరు కనకమ్మ బుధవారం మృతి చెందారు. ప్రస్తుతం ఆమె పాలవలస సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. దీంతో పలువురు ఆమె మృతికి సంతాపం తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

● చిన్నజీయర్ స్వామి

బెలగాం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చిన్నజీయర్‌స్వామి అన్నారు. బుధవారం పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన శ్రీరామ పాదుకా పట్టాభిషేకంలో ఆయన పాల్గొన్నారు. ఐశ్వర్యం, ఆరోగ్యం ఉండాలంటే ప్రతి ఒక్కరూ భగవదారాధన చేయాలని సూచించారు. శ్రీరాముడు అందించిన సంప్రదాయాన్ని కొనసాగించి ప్రకృతిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం మనుషుల మధ్య బంధుత్వాలు దూరమవుతున్నాయని.. ముున్ముందు బంధాలు బలపడాలని ఆకాంక్షించారు. వర్షాలు సకాలంలో కురువాలన్నా.. కోరిన కోర్కెలు నెరవేరాలన్నా దేవుడిని మనసారా పూజించాలని హితబోధ చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులకు తీర్థం అందించారు. మున్సిపల్ వైస్ చైర్మన్, వికాస తరంగిణి పార్వతీపురం శాఖ అధ్యక్షుడు యిండుపూరు గున్నేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. అంతకుముందు స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో తీర్థ గోష్ఠి కార్యక్రమం నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బంగార్రాజు

భోగాపురం, మార్చి5(ఆంధ్రజ్యోతి) మండలంలోని లింగాలవలసకు చెందిన ఓదూరు గోవింద్‌కు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.1,85,108 మంజూరైంది. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును బుధవారం పోలిపల్లిలో బాధితుడికి మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అందజేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో ఏఎస్‌ఐ ప్రతిభ

విజయనగరం క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ సిటీ పెదగంట్యాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో స్థానిక వన్‌టౌన్ ఏఎస్‌ఐ అల్తి త్రినాథరావు ప్రతిభ చాటారు. పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని వకుల్ జిందాల్‌ను.. ఏఎస్‌ఐ త్రినాథరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐను ఎస్పీ అభినందించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్ గపాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

గజపతినగరం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): రాజీపడదగిన కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని న్యాయాధికారి బి.కనకలక్ష్మి ఓ ప్రకటనలో సూచించారు. ఈనెల 8న స్థానిక కోర్టులో నిర్వహించనున్న లోక్‌అదాలత్ కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. కోర్టులు చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బును వృథా చేసుకోవద్దని హితవు పలికారు.

మామిడి మొక్కల పంపిణీ

శృంగవరపుకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట గ్రీన్ ఎర్త్ ఆర్గనైజేషన్ (జియో) బుధవారం మామిడి మొక్కలను పంపిణీ చేసింది. నీటి సదుపాయం కలిగిన రైతులు ఈ వేసవిలో ఫలసాయం ఇచ్చే మొక్కలను నాటుకోవచ్చని సంస్థ వ్యవస్థాపకుడు బి.రామకృష్ణ తెలిపారు. అంటు కట్టేందుకు కూడా మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి గలవారు 9391138665 ను సంప్రదించాలన్నారు.

కిరాణా దుకాణంలో రేషన్ సరుకులు



రేషన్ సరుకులను గుర్తించిన అధికారులు

నెల్లిమర్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండవెలగాడలో గల కిరాణా దుకాణంలో రేషన్ డిపోకు చెందిన సరుకుల విక్రయాలు జరుగుతున్నట్టు బుధవారం గుర్తించామని డీటీ గౌరీశంకర్ తెలిపారు. కిరాణా వ్యాపారి మామిడిపాక మురళీప్రసాద్ దుకాణంలో బియ్యం 4 క్వింటాళ్లు, 41 పంచదార అరకిలో ప్యాకెట్లు, 10 కందిపప్పు ప్యాకెట్లు గుర్తించామన్నారు. వ్యాపారిపై 6ఏ కేసు నమోదు చేశామన్నారు.

పెట్ స్కాన్‌ను ఆరోగ్యశ్రీలో చేర్చండి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కాన్సర్ రోగులకు ఎంతో ఉపయోగపడే పెట్ స్కాన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీలో చేర్చాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. బుధవారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ రూ.25వేలు విలువ చేసే ఈ స్కాన్‌ను పేద, మధ్యతరగతి రోగులు చేయించుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. దీన్ని ప్రభుత్వం అర్థం చేసుకోవాలన్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయండి

గరివిడి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని డీఈవో యు.మాణిక్యంనాయుడు అన్నారు. మండలంలో కాపుసంబం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం విద్యార్థులతో కలిసి భోజనం చేసి మెనూపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డి.రాము, ఉపాధ్యాయులు గోపాలకృష్ణ, చల్లా సింహాచలం, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

సహకార సొసైటీతో రైతులకు భరోసా

గుర్ల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీ రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని జిల్లా సహకార బ్యాంకు సీఈవో ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం గూడం సొసైటీ పరిధిలో పాము కాటుతో మృతి చెందిన మృతుడి కుటుంబ సభ్యులకు రూ.2లక్షలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ డీజీఎం బీఎస్ఎస్ ప్రసాద్, బీఎం హరికేశవరావు, నివేదిత ఉన్నారు.

ఎమ్మెల్సీ దువ్వాడపై చర్యలు తీసుకోండి



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న రవికుమార్

విజయనగరం క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని జనసేన నాయకుడు వెలమ కార్పొరేషన్ డైరెక్టరు మిడతాన రవికుమార్ కోరారు. బుధవారం జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన దువ్వాడ శ్రీనుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ విజయనగరం డీఎస్పీ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. ఆయనతో పాటు నాయకులు రామునాయుడు, కూర్మారావు, మజ్జి సత్యనారాయణ, యశ్వంత్ తదితరులున్నారు.

దువ్వాడా.. నోరు అదుపులో ఉంచుకో..

రాజాం రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నోరు అదుపులో పెట్టుకోక పోతే కటకటాలు లెక్కించాల్సి వస్తుందని జనసేన రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి పొగిరి సురేష్‌బాబు.. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నెలకు రూ.50 కోట్లు పవన్‌కల్యాణ్‌కు ఇస్తున్నారని, దీంతో చంద్రబాబు చెప్పినట్లు పవన్‌కల్యాణ్ తలూపుతున్నారని ఇటీవల దువ్వాడ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రాజాంలోని జనసేన కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దువ్వాడ శ్రీనివాస్ తీరుపై ఆయన విరుచుకుపడ్డారు. అనంతరం ఈనెల 14న పిఠాపురం నియోజకవర్గంలోని చిత్రాడలో నిర్వహిస్తున్న జనసేన ఆవిర్భావ సభ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో నాయకులు లెంక అన్నంనాయుడు, డబ్బాడ కృష్ణ, శెట్టి ఆదినారాయణ, కె.వి.ప్రసాద్, మహేష్, రాజేశ్, రాంబాబు, రవి పాల్గొన్నారు.

● జామి: తండ్రి చనిపోతే అదేమి పట్టించుకోకుండా ముఖ్యమంత్రి కావాలనే ఆశతో సంతకాలు సేకరించిన జగన్మోహన్‌రెడ్డి... ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను విమర్శించడం ఆయన విజ్ఞతకు నిదర్శనమని వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ మాకిరెడ్డి శ్రీలక్ష్మి అన్నారు. బుధవారం జామిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జగన్‌లో ఫ్రస్టేషన్ పెరిగిందన్నారు. ఏం మాట్లాడుతున్నారో అయనకే అర్థం కావడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్, పవన్‌కల్యాణ్‌పై ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన అవగాహన లోపం తెలుస్తుందన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

గజపతినగరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈనెల 14న నిర్వహించనున్న జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని అందరూ జయప్రదం చేయాలని ఆ పార్టీ పీఏసీ నాయకురాలు, మాజీ మంత్రి పడాల అరుణ అన్నారు. ఈమేరకు బుధవారం తన నివాసంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి సంబంధించిన వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మునకాల జగన్, తాళ్లపూడి సావిత్రి, త్రివేది తదితరులు పాల్గొన్నారు.

● శృంగవరపుకోట: జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని అందరూ జయప్రదం చేయాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి ఒబ్బిన సత్యనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాండ్రంగి చంటి, మోపాడ చిన్ని, ఒబ్బిన సన్యాసినాయుడు తదితరులున్నారు.

జాతర ఆదాయం రూ.24.66 లక్షలు



ఆదాయాన్ని లెక్కిస్తున్న వాలంటీర్లు

చీపురుపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కనకమహాలక్ష్మి అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారికి రూ.2,66,278 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో బండ్లమూడి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. వంద రూపాయల టిక్కెట్ల ద్వారా రూ.3,51,600, రూ.50 టిక్కెట్ల ద్వారా రూ.4,30,400, రూ.20 టిక్కెట్ల ద్వారా రూ.2,18,500, హుండీల ద్వారా రూ.14,47,302, ఇతర మార్గాల్లో 18,436లు లభించిందని తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ యేడాది అమ్మవారి ఆదాయం 2,22,098 పెరిగిందన్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ తనిఖీదారుడు జి.శ్యాంప్రసాద్, జాతర నిర్వహణ కమిటీ, పోలీసులు పాల్గొన్నారని ఈవో తెలిపారు.

9 నుంచి పైడితల్లమ్మ జాతర

భోగాపురం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలిపల్లిలో ఈనెల 9 నుంచి పైడితల్లిమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ పైడిరాజు, ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉత్సవ కమిటీకి అందరూ సహకరించాలని వారు కోరారు.

10 నుంచి కనకదుర్గమ్మ..

భోగాపురం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): భోగాపురంలో ఈనెల 10 నుంచి 12 వరకు కనకదుర్గమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపారు. జాతర మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. జాతర సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

లైన్‌మెన్ సేవలు ప్రశంసనీయం



లైన్‌మేన్లను అభినందిస్తున్న ఈఈ

రాజాం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో విద్యుత్ లైన్‌మెన్ సేవలు ప్రశంసనీయమని విద్యుత్ శాఖ ఈఈ సురేష్‌బాబు కొనియాడారు. లైన్‌మెన్ దివస్ సందర్భంగా బుధవారం పలువురు లైన్‌మెన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన నిరంతరం విద్యుత్ అందించడంలో లైన్‌మెన్ పాత్ర కీలకమైనదని కొనియాడారు. కార్యక్రమంలో ఏడీఏ మణికుమార్, ఏఈలు సురేష్‌బాబు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుండా భూముల స్వాధీనం

● ఆందోళన చెందుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధితులు



హైవే కాంట్రాక్టర్లు వేసిన షెడ్‌లు

కొత్తవలస, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ-రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం సేకరించిన భూములకు పరిహారం చెల్లించలేదు. అయినప్పటికీ భూములను సంబంధిత కాంట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపరిహారం చెల్లించకుండా భూములు స్వాధీనం చేసుకోవడం ఎంతవరకు న్యాయమని ఉత్తరాపల్లి గ్రామానికి రైతులు ప్రశ్నించారు. నష్టపరిహారం చెల్లించాలని రైతులు అధికారులు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వెలిబుచ్చారు. కాగా.. ఇ్కఆ పలువురి భూములను సర్వే చేయకుండా హైవే కాంట్రాక్టర్లు షెడ్‌ల నిర్మాణం చేపట్టడంపై వారు అభ్యంతరం తెలిపారు. భూములు నష్టపోయిన వారికి న్యాయం చేయాలని ఆర్డీవో అధికారులను ఆదేశించినా రెవెన్యూ అధికారుల్లో మార్పు లేకుందని ఆందోళన చెందుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లా అధికారులు జోక్యం చేసుకోవాలని వారు కోరారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

క్రైంన్యూస్

శృంగవరపుకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట రైల్వే స్టేషన్ సమీపంలో 12 కిలోల గంజాయి, దాన్ని తరలిస్తున్న వ్యక్తిని ఎస్.కోట పోలీసులు బుధవారం ఉదయం పట్టుకున్నారు. ఈ విషయమై సీఐ నారాయణమూర్తి మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి గంజాయితో సంచరిస్తుండగా తనిఖీ చేశామన్నారు. సదరు వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచామని వివరించారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్టు

బొబ్బిలి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి చైన్ స్నాచర్లను అరెస్టు చేసినట్లు బొబ్బిలి డీఎస్పీ జి.భవ్యారెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని కారాడలో చొక్కాపు గౌరమ్మ మెడలో నుంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడును ఆటోలో వస్తున్న ఇద్దరు వ్యక్తులు ఆదివారం అపహరించుకుపోయారని చెప్పారు. భర్త గౌరునాయుడుకు ఇతర కుటుంబసభ్యులకు జరిగిన విషయాన్ని చెప్పడంతో వారు బొబ్బిలి పోలీసులను ఆశ్రయించారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి బుధవారం బొబ్బిలి మండలంలోని పారాది దగ్గర ఆటోలో మెంటాడ మండలంలోని పిట్టాడ గ్రామానికి చెందిన గొర్లె పెద్దింటమ్మ, కొత్తవలస గ్రామానికి చెందిన మేకల హరిని గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. తురకనాయుడువలస నుంచి చీపురుపల్లి అమ్మవారి పండుగకు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో కారాడ వద్ద చోరీకి పాల్పడ్డారని తెలిపారు. మూడు రోజుల వ్యవధిలోనే నిందితులను పట్టుకొన్న సీఐ సతీష్ కుమార్, ఎస్‌ఐ రమేష్, ఏఎస్‌ఐ రమణ, పీసీలు శ్రీహరిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించినట్లు డీఎస్‌పి భవ్యారెడ్డి చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భోగాపురం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమటాంరాయవలస సమీప జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్ఛాపురానికి చెందిన పాండే జ్యోతేంద్రనారాయణకు తీవ్రగాయాలయ్యాయి. అయటాంరాయవలస సమీపంలో శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్లే జాతీయ రహదారిపై లారీని నిలిపి టైర్లలో గాలిని డ్రైవర్ తనిఖీ చేయించుకుంటున్నాడు. అదే రహదారిలో ద్విచక్రవాహనంపె పాండే జ్యోతేంద్రనారాయణ వస్తూ ఆగి ఉన్న లారీని వెనక నుంచి బలంగా ఢీ కొన్నాడు. దీంతో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం 108లో విజయనగరం తరలించగా పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి తగరపువలసలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడు కోమాలో ఉన్నాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని సీఐ ప్రభాకర్ తెలిపారు.

సారా విక్రయదారుడి అరెస్టు

విజయనగరం క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస మండలం చిన్నమన్నెపాలెం శివారులో సారా విక్రయిస్తున్న కాకర శంకర్‌ను బుధవారం అరెస్టు చేసినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఐ సీహెచ్.రాజశ్రీ తెలపారు. అతడి నుంచి సారా తయారీ సామగ్రితో పాటు ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో హెచ్‌సీ సుదర్శనకుమార్, ఈసీలు రాము, జనార్దనరావు, ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య విద్యార్థుల ఆందోళన ఉధృతం



విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల డీన్

గరివిడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నెల రోజులుగా శాంతియుతంగా చేస్తున్న ఆందోళనను బుధవారం గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థులు ఉధృతం చేశారు. కళాశాల ప్రధాన గేటు వద్ద ఆందోళనకు దిగారు. లోపలకు అధ్యాపకులు, సిబ్బందిని వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. యంత్రాంగం సరిగా స్పందించకపోగా బుధవారం నుంచి మెస్ నిలుపుదల చేయడం, హాస్టల్ ఖాళీ చేయాలని అధ్యాపకులు చెప్పడంపై విద్యార్థులు కళాశాల గేటు ఎదుట వంటావార్పునకు దిగారు. ఉదయం 11 గంటల సమయంలో విద్యార్థులతో కళాశాల డీన్ ఎం.రాము, అధ్యాపకులు చర్చించారు. విద్యార్థులకు నచ్చజెప్పారు. దాంతో విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బందిని లోపలకు అనుమతించారు. ఇదిలా ఉండగా సాయంత్రం 6 గంటల సమయంలో విద్యార్థులతో కళాశాల అధ్యాపకులు మరోమారు చర్చలు జరిపారు. మెస్ తెరవడంతో పాటు హాస్టల్‌లో విద్యార్థులు ఉండేందుకు అనుమతించారు. దాంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా గరివిడి పోలీసులు చర్యలు చేపట్టారు.

నేడు మద్యం దుకాణాలకు డ్రా

విజయనగరం క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో గురువారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమక్షంలో గీత, సొండి కులాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు డ్రా తీయనున్నట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు అందరూ ఉదయం 9 గంటలకు ఆడిటోరియంలోకి చేరుకోవాలన్నారు.

● రాజాం: గీతకులాలకు కేటాయించిన మద్య దుకాణాలకు షాపులకు గురువారం కలెక్టరేట్‌లో లాటరీ వేయడం జరుగుతుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

సాంకేతిక నైపుణ్యంపై దృష్టిసారించండి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చంద్రభూషణరావు

గరివిడి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంజినీరింగ్ విద్యార్థులు సాంకేతిక నైపుణ్యంపై దృష్టిసారించాలని గురజాడ జేఎన్‌టీయూ ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ చంద్రభూషణరావు అన్నారు. గరివిడి అవంతీస్ సెయింట్ థెరిసా ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం ఉదయం ఆటోస్, 2కే25 పేరిట అవంతీ విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అధ్యక్షతన జాతీయస్థాయి సాంకేతిక ఉత్సవాలు నిర్వహించారు. అ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైజాగ్ యార్డు మేనేజర్ చక్రవర్తి, ఏపియన్ ఇన్ఫోటెక్ ప్రతినిధి జె.కుమార్, ప్రొఫెసర్ కె.నాగసుమన్, ఏవో అనీల్‌కుమార్, ప్రిన్సిపాల్ వి.జాషువా పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు సెలవుల పెంపుపై హర్షం

భోగాపురం, మార్చి5(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులను ఐదు రోజులు పెంచుతూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేయడంపై భోగాపురం ఏపీ ఎన్జీవో తాలుకా అధ్యక్ష, కార్యదర్శులు కొమ్మూరు దుర్గారావు, పి.కృష్ణవేణి ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వైద్యశాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులకు మాత్రమే ఈ సౌకర్యం ఉండేదని ప్రస్తుత ఉత్తర్వుల కారణంగా ఏటా 35 రోజులు సెలవుల అర్హత ఉన్న శాశ్వత ఉద్యోగులకు కూడా అదనంగా ఐదు రోజులు సెలవులు లభిస్తాయన్నారు.

ఇళ్ల స్థలాల పరిశీలన

భోగాపురం, మార్చి5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుపల్లి గ్రామంలో ఇళ్లకు సంబంధించి స్థల పరిశీలన చేసినట్టు తహసీల్దారు సురేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2019లో ఇదే గ్రామానికి చెందిన 12 మందికి ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసిందన్నారు. అయితే అప్పట్లో వారికి స్థలాలు అప్పగించలేదన్నారు. దీంతో ఇటీవల స్థలాలు అప్పగించాలంటూ బాధితులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారన్నారు. దాంతో గ్రామంలో సర్వే నెంబరు 1లో స్థల పరిశీలన చేశామన్నారు. అయితే స్థానికులు అడ్డుకోవడంతో పోలీసుల సమక్షంలో స్థలాల పరిశీలన చేశామన్నారు. పోలీసుల సమక్షంలో ఇంటి స్థలాలను గుర్తించి లబ్ధిదారులకు అప్పగిస్తామని తహసీల్దారు సురేష్ తెలిపారు.

హిందూ ధర్మరక్షణే ధ్యేయం

●త్రిదండి చిన జీయర్ స్వామి



చిన్నజీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకుంటున్న కలెక్టర్ దంపతులు

పార్వతీపురంటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మరక్షణే ధ్యేయమని త్రిదండి చిన జీయర్ స్వామి తెలిపారు. బుధవారం పార్వతీపురం టౌన్ పోలీసు స్టేషన్ వీధిలో గల ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో తీర్థగోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న జీయ్యర్ స్వామి మాట్లాడుతూ ఆధ్యాత్మిక, భక్తిమార్గం ద్వారా ప్రతి ఒక్కరూ పయనించాలన్నారు. కాగా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ దంపతులకు ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో వికాసతరంగిణి పార్వతీపురంశాఖ అధ్యక్షుడు ఐ.గున్నేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 394 మంది గైర్హాజరు

బెలగాం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 34 కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు రెండో రోజు బుధవారం 394 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్ జిల్లా విద్యాశాఖాధికారి మంజులవీణ తెలిపారు. ఈ మేరకు పరీక్షకు 8,520 మంది విద్యార్థులకుగాను 8,126 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 5620 మంది విద్యార్థులకు గాను 5445 మంది, ఒకేషనల్ విభాగంలో 2900 మంది విద్యార్థులకు గాను 2681 మంది పరీక్షలకు హాజరవ్వగా, 394 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

పాలకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓ షాపింగ్‌మాల్‌లో అగ్ని ప్రమాదాలు నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి కోసం వినియోగించే పరికరాల పనితీరును వివరించారు. కార్య క్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

పాలకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శారీరక, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ డి గ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు సూచించారు. బుధవారం పాలకొండలోని కళాశాలలో అంతర్జాతీయ మహిళా వారోత్సవాల్లో భాగంగా యోగా కార్య క్రమం నిర్వహించారు. విద్యార్థులకు యోగా ఆవశ్యకతపై పాలకొండ ప్రభుత్వ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.నిరీక్షణ వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్య క్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు పల్లా రాజ్యలక్ష్మి, ప్రశాంతి పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ల కార్యవర్గం

పార్వతీపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీఎన్‌జీవో సంఘ భవనంలో ఏపీ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ పార్వతీపురంశాఖ కార్యవర్గ ఎన్నిక రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.తిరుపతిబాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. విజయనగరం జిల్లా అధ్యక్షుడు అప్పలనాయుడు, అనకాపల్లి జిల్లా కార్యదర్శి ఎం.శంకరరావు, రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కేవీ వెంకటేశ్వరరావు పరిశీలకులుగా హాజరయ్యారు. సభాధ్యక్షులుగా ఏపీఎన్‌జీవో పార్వతీపురం అధ్యక్షులు జీవీఆర్.ఎస్.కిషోర్ వ్యవహరించారు.

●జియ్యమ్మవలస, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ జిల్లా కార్యదర్శిగా రావాడ రామభద్రపురం పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ రెడ్డి సురేష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

ఈఈపై చర్యలు తీసుకోవాలి

● మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు

జియ్యమ్మవలస,మార్చి 5(ఆంధ్రజ్యోతి):ఉపాధిహామీ పథకంనిధులతో కురుపాం నియోజకవర్గంలో జరిగే పలు అభివృద్ధి పనులు పర్యవేక్షణ లోపించిందని, ఈవిషయంపై ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌పై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజుకోరారు. బుధవారం జియ్యమ్మవలసలో విలేకరులతో మాట్లాడుతూ గిరిజన,దళిత, వెనుకబడినవర్గాల సంక్షేమం దృష్టిలో పెట్టుకొని పూర్తిగా రహదారిలేని గ్రామాలకు రూ.49.04కోట్లతో రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. దీనికి పర్యవేక్షణ అధికారిగా ఐటీడీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు కలెక్టర్ అప్పగించారని, అయితే పనులను ఒక్కసారైనా పర్యవేక్షించలేదని పేర్కొన్నారు. ఇంత నిర్లక్ష్యంగావ్యవహరిస్తునన ఆయనపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని కోరారు.

జీడికి రూ.20 వేల ధర ప్రకటించాలి

●ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జీడిమామిడి పంటను ప్రభుత్వం క్వింటాకు రూ.20 వేలు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం ఉద్యోగుల కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో లేవిడి రబ్బరు తోటలో ఈనెల పదో తేదీన జరిగే జిల్లా సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ జీడిమామిడి ప్రాసెసింగ్ యూనిట్లను, ఉత్పత్తుల సంస్థలను ఏర్పాటు చేసి గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. జీడి మామిడి పంటకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి కూలీల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్య క్రమంలో పువ్వల ప్రసాద్, మండంగి సింగన్న, రామ్మూర్తి, తాతారావు, సూరయ్య, జనార్దన పాల్గొన్నారు.

కీసరలో కట్టడాలు నిలుపుదల



ఇళ్ల నిర్మాణాలు నిలిపివేయాలని సూచిస్తున్న కాంతారావు

భామిని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కీసరలో గ్రామకంఠం, గయాల్‌లో ఇళ్లు నిర్మించకూడదని కోర్టు నుంచి ఆదేశాలు తేవడంతో అక్కడ నిలుపుదల చేసినట్టు తహసీల్దార్ ఎస్.అప్పారావు తెలిపారు. బుధవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు మండల సర్వేయర్ ఐ.రజేష్, రెవెన్యూ సిబ్బంది, బత్తిలి ఏఎస్‌ఐ కె.కాంతారావు పర్యవేక్షణలో 153, 146 సర్వే చేపట్టారు. కోర్టు నిబంధనలు ఉండడంతో ఇళ్లు నిర్మించవద్దని లబ్ధిదారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐమణిప్రభ, వీఆర్వో శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బత్తిలిలో సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

భామిని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తిలిలో వెలిసిన సంతోషిమాత ఆలయం 39వ వారికోత్సవం గురువారం ప్రారంభమైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలతోపాటు హోమాల నిర్వహణ, మొక్కులు చెల్లించనున్నట్లు చెప్పారు.

శ్మశానానికి స్థల సమస్య పరిష్కరించండి

సాలూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి శ్మశాన స్థల సమస్యను పరిష్కరించాలని కందులపథం పంచాయతీకి చెందిన గిరిజన నేతలు తాడంగి కన్నంనాయుడు,కొండగొర్రి పుష్పారావు కోరుతున్నారు. పంచాయతీలో మర్రివానివలస, తీనుసామంతవలసకు మధ్య ఉన్న ఖాళీస్థలాన్ని గతంలో శ్మశానంగా ఇరు గ్రామాల ప్రజలు వినియోగించుకునే వారని తెలిపారు. నాలుగేళ్లుగా ఆ స్థలం తనకు చెందినదని ఓ వ్యక్తి అక్కడ అంత్యక్రియలు నిర్వహించడానికి అభ్యంతరం చెప్పుతున్నాడని తెలిపారు. ఈ విషయమై గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు చేశామని చెప్పారు.

మహిళా దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి

● గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్‌తోపాటు డీఆర్వో

పార్వతీపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు శోభాయమానంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేయాలని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి మహిళా దినోత్సవం నిర్వహణపై కలెక్టర్లు , అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వీలుగా వేదికను సిద్ధం చేయాలన్నారు. ఆహ్వానపత్రికలను ముద్రించి మం త్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించాలని తెలిపారు.వివిధ స్టాళ్లను ఏర్పాటుచేయాలని, సీఎంచంద్రబాబునాయుడు ప్రత్యక్ష ప్రసారాన్ని తిలకించేలా డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటుచేయాలన్నారు.సమావేశంలో డీఆర్వో కె.హేమలత, కనకదుర్గ పాల్గొన్నారు.

కొండను కొల్లగొడుతున్నారు!

(5వ పేజీ తరువాయి)

అడ్డుకోలేక పోయారు. అయితే దీనిపై కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నామని ఇప్పుడు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. న్యాయస్థానానికి సమర్పించాల్సిన పత్రాలను ప్రభుత్వ న్యాయవాదికి అందించామంటున్నారు. అయితే ఇప్పటివరకు వారు కోర్టును ఆశ్రయించలేదు.

ప్రభుత్వం మారినా..

వైసీపీ ప్రభుత్వం మారిన తర్వాత గ్రానైట్ తవ్వకాలు నిలిచిపోతాయని ఆ ప్రాంత ప్రజలు భావించారు. కానీ యథావిధిగా తవ్వకాలు జరుగుతున్నాయి. దీనిపై టీడీపీ ప్రజాప్రతినిధులు కూడా మౌనం వహించడంపై విమర్శలు వ్యక్తమవుతన్నాయి. ఇప్పటికే జనసేనపార్టీ ఆందోళన చేసినప్పటికీ తవ్వకాలు ఆగలేదు. బడిదేవరకొండ గ్రానైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాట కమిటీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా ఎటువంటి ఫలితం లేకపోయింది. హైకోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ కోట్లాది రూపాయలు విలువ చేసే గ్రానైట్‌ను కాంట్రాక్టర్లు తరలిస్తున్నారు.

హైకోర్టుకు వెళ్తాం..

కోరి రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్-1లో ప్రస్తుతం గ్రానైట్ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ ప్రాంతం రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందిందని అటవీశాఖ గతంలో ఆధారాలతో సహా నిరూపించింది. తిరిగి అదే ప్రాంతంలో గ్రానైట్ తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీనిపై తిరిగి హైకోర్టుకు వెళ్తాం.

- బి.రామ్‌నరేష్, పార్వతీపురం అటవీశాఖ రేంజర్

రెండో విడతకు శ్రీకారం

(5వ పేజీ తరువాయి)

బ్యాంక్ అకౌంట్ నెంబర్లు, ఐఎఫ్ఎస్‌సీ కోడ్‌లు, ఫోన్ నెంబరు, వారి భూమి ప్రాప్తికి అప్‌డేట్ చేసే కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

● ప్రస్తుత వెబ్‌ల్యాండ్, 1బీ ఎంట్రీలు చదివి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి రిజిస్టర్‌లో నమోదు చేయాలి. దాని ప్రకారం అక్కడే రైతులకు వ్యక్తిగత నోటీసులు ఇచ్చి వారి నుంచి తిరిగి రశీదు స్వీకరించాలి.

● ఈ విధంగా ఆయా మండలాల తహసీల్దార్లు రికార్డులను సిద్ధం చేసుకోవాలి. దీని ద్వారా గ్రామ సర్వేయర్, రెవెన్యూ అధికారి రోజుకు కనీసం 20 ఎకరాల్లో రీసర్వే పూర్తి చేయాల్సి ఉంది. ఈ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఒక్కో రైతుకు సర్వే చేసిన ప్రాంతంలో ఒక ఎల్‌పీఎం ఇవ్వాలి. అవకతవకలకు పాల్పడితే సదరు వీఆర్‌వో, సర్వేయర్‌పై కఠిన చర్యలు తప్పవు.

ఈ నెలాఖరుకు పూర్తవ్వాలి

జిల్లాలో మొదటి విడత రీసర్వే పూర్తి చేశాం. రెండో విడత సర్వే కూడా ఎటువంటి విమర్శలకు తావులేకుండా ఈ నెలాఖరుకు పూర్తవ్వాలి. ఇందుకోసం కచ్చితమైన నిర్ణయాలతో చర్యలు తీసుకుంటున్నాం.

పి.లక్ష్మణరావు, ఏడీ సర్వే శాఖ, పార్వతీపురం మన్యం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం

●ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి



సామూహిక సీమంతాలు నిర్వహిస్తున్న సుగుణకుమారి

గరుగుబిల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన పోషకాహారాన్ని అందిస్తున్నట్లు ఐసీడీఎస్ పీవో సుగుణకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని పెదగుడబ పంచాయతీ సన్యాసిరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి గొట్టాపు సుగుణకుమారి, పెదగుడబ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్లు గర్భిణులకు గాజులు, జాకెట్ ముక్కలు, పండ్లు, స్వీట్లు అందజేశారు.

అఫిలియేషన్‌పై ఏయూకు నివేదిక



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ప్రొఫెసర్లు

గుమ్మలక్ష్మీపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పర్మినెంట్ అఫిలియేషన్ కోసం నివేదికను విశ్వవిద్యాలయానికి సమర్పిస్తామని ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు కె.వెంకటరావు, పి.బి.పడాల్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పర్మినెంట్ అఫిలియేషన్ మంజూరు నిమిత్తం కళాశాలను కె.వెంకటరావు, పి.బి.పడాల్ పరిశీలించారు.ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవరం ఆధ్వర్యంలో కళాశాలలోని తరగతి గదులు, ల్యాబ్‌లు, రికార్డులను ప్రొఫెసర్లు పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.రామయ్య, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ కల్పన, శ్రీవాణి, తులసి పాల్గొన్నారు.

ప్రహరీ పనులు పూర్తిచేయండి

వీరఘట్టం, మార్చి 5(ఆంధ్రజ్యోతి):వ్యక్తిగత ఇంకుడుగుంతలు, పంట కుంటలు, పశువుల కొట్టాలు, ప్రహరీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో బి.వెంకటరమణ కోరారు. బుధవారం వీరఘట్టం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలని కోరారు. గరిష్టవేతనం రూ.300 వేతనదారులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జి.సత్యంనాయుడు, సాంకేతిక సహాయకులు, క్షే త్ర సహాయకులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

●పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో అనంతలక్ష్మి



మాట్లాడుతున్న అనంతలక్ష్మి

మక్కువ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పాచిపెంట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో బి.అనంతలక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కాశీపట్నం కేజీబీవీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలకు చదువు ఆయుధమని, దానిని సరైన పద్ధతిలో వినియోగించుకొని ఉద్యోగాల్లో రాణించాలన్నారు. మహిళలకు అనేక చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి జి.నాగదుర్గ, సూపర్‌వైజర్ పి.రాజశ్రీ, మహిళా పోలీస్ రేవతి, పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న మధుసూదనరావు

గరుగుబిల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టుల పరిధిలో ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయాలని తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు మంగళగిరి పార్టీ కార్యాలయంలో కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధు సూదనరావు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రతినిధులు ఎం.పురుషోత్తంనాయుడు, ఎ.తవిటినాయుడు (రాంబాబు) పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు రహదారులకు నిధులు కేటాయించాలని,ముస్లిం కుటుంబాలకు శ్మశానం కోసం స్థలం కేటాయింపుతో పాటు తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టుల పరిధిలో ఎత్తిపోతల పతకాలు మంజూరు చేసి సాగునీరందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

'పీఎం జన్‌మన్' ఇళ్లు పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ ధర్మచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ధర్మచంద్రారెడ్డి

కురుపాం,మార్చి5(ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకం కింద మంజూరైన ఇళ్లనిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని హౌసింగ్ పీడీ పి.ధర్మచంద్రారెడ్డి కోరారు. బుధవారం రస్తాకుంటుబాయి, గోటివాడలో ఇళ్ల నిర్మాణం పరిశీలించారు. అనంతరం కురుపాం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ధర్మచంద్రారెడ్డి మాట్లాడుతూ బిల్లులు త్వరగా చెల్లిస్తుండడంతో గ్రామాల్లో లబ్ధిదారులకు అవగాహన కల్పించి పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్ రమణమ్మ, హౌసింగ్ డీఈఈ ఎన్.వెంకటరావు, ఏఈ జి.అచ్చియ్యమ్మ,వర్కుఇన్‌స్పెక్టరు ఎస్.రాజేష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సాలూరులో భస్మబుధవార ప్రార్థనలు



సాలూరులో భస్మబుధవార ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

సాలూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సాలూరు పెదహరిజనపేట ఆర్సీఎం చర్చిలో లెంట్ దినాలు (శ్రమ దినాలు) ప్రారంభంకావడంతో బుధవారం భస్మబుధవార ప్రార్థనలు ఫాదర్ మరియదాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఏసుకు విశ్వాసులు ప్రత్యేక ప్రార్థనచేశారు.పలువురు లెంట్ దినాలు పాటిస్తున్నారు. 40 రోజులు మాలాధారణ చేసి శ్రమ దినాలను విశ్వాసులు పాటించనున్నారు. ప్రతి రోజూ చర్చిలో ప్రార్థన అనంతరం ఒకరి ఇంటికెళ్లి ప్రత్యేక ప్రార్థన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈస్టర్ వరకు నియమనిష్టలతో ప్రార్థనలు చేయనున్నారు. భస్మబుధవారం సందర్భంగా పెద్దసంఖ్యలో విశ్వాసులు చర్చికి హాజరయ్యారు.

నగర పంచాయతీ కమిషనర్ సస్పెన్షన్

పాలకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక నగరపంచాయతీ కమిషనర్ సామంచి సర్వేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గత నెల 25న ఓ వైద్యాధికారి భారతి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడారు. ఈ మేరకు ఆయనపై శాఖాపరమైన చర్యల్లో భాగంగా గతనెల 25 నుంచి సస్పెండ్ చేసినట్లు మునిసిపల్ అడ్మిని స్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ డిపార్ట్‌మెంట్ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయండి

సీతంపేట రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను మానసికంగా సిద్ధం చేయాలని ఐటీడీఏ డిప్యూటీ ఈవో రవి ప్రసన్న కుమార్ సూచించారు. బుధవారం పూతికవలస, చిన్నబగ్గ గిరిజన సంక్షేమ ఆశ్రమపాఠశాల పరిశీలించారు.ఈసందర్భంగా పాఠశాలల్లో రికార్డులు తనిఖీ చేశారు.

రైతులు ఈ-కేవైసీ చేయించుకోవాలి

బాడంగి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీ, ఏపీ ఎఫ్ఆర్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ భూమి కలిగిన ప్రతీ రైతు చేయించుకోవాలని, ఈ-పంట నమోదు, ఈ-కేవైసీ గురువారం నాటికి పూర్తిచేయాలని వ్యవసాయాధికారి కె.శిరీష కోరారు. బుధవారం మండలంలోని రేజేరు, ఆనవరం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

రూ.371 కోట్లతో ఉపాధి పనులు

రామభద్రపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది ఉపాధిహామీ పథకం కింద రూ.371 కోట్లతో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నట్లు డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఎస్.శారదాదేవి తెలిపారు.బుధవారం రామభద్రపురంలో విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 54,714 పనులు మంజూరు చేశామని, రూ.5 లక్షల 94 వేల మంది వేతనదారులు పనులు చేస్తున్నారని చెప్పారు.

ప్రత్యేక కమిషన్‌ను నియమించండి

పార్వతీపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):పార్వతీపురం నియోజకవర్గంలో కనుమరుగైన చెరువులు, వైసీపీ ప్రభుత్వం ప్రారంభంలో జరిగిన భూదందాలు తదితర అంశాలపై ప్రత్యేక కమిషన్ వేయాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో రాష్ట్ర రెవెన్యూశాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియాను కలిశారు. గతంలో 70 చెరువులు ఉండేవని, ప్రస్తుతం 14 చెరువుల మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

రేపు చినమేరంగిలో సిర్లి జాతర

జియ్యమ్మవలస, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినమేరంగిలో సిర్లిపోతన్న జాతర శుక్రవారం జరగనుందని ఆలయ పూజారి బొత్స జైపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఐదు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు జరగనున్నదని పేర్కొన్నారు.

రీసర్వే రికార్డుల పరిశీలన

భామిని, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘనసరలో రీసర్వే నిర్వహణకు రీసర్వే డీటీ రమేష్ ఆధ్వర్యంలో వీఆర్వోలు రైతుల వివరాలు ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈనెల తొమ్మిదో తేదీ వరకు టేబుల్ వర్క్ చేస్తామని, అనంతరం క్షేత్రస్థాయిలో సర్వేకు చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు గిరీష్, రామారావు, జగన్మోహన్ పాల్గొన్నారు.

ఉత్తమ లైన్‌మన్‌గా సింహాచలం

గరుగుబిల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): లైన్‌మెన్ పూడి సింహాచలం ఉత్తమ లైన్‌మన్‌గా ఎంపికయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈనెల నాలుగో తేదీన న్యూఢిల్లీలో జరిగిన లైన్‌మెన్ దివాస్ కార్యక్రమంలో ఉన్నతాధికారులు జాతీయ అవార్డును అందజేశారు. దళాయివలస గ్రామానికి చెందిన సింహాచలం మెరుగైన సేవలందించి అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందించారు.

బెల్లం ఊట ధ్వంసం

వీరఘట్టం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర గ్రామ సమీపంలో బుధవారం డ్రోన్ సాయంతో పోలీసులు బెల్లం ఊటను గుర్తించి ధ్వంసం చేసి కేసు నమోదు చేశామని ఎస్ఐ జి.కళానిధి తెలిపారు. ఆధునిక పద్ధతిలో మారుమూల ప్రాంతాల్లో నిఘా ఏర్పాటుచేయడం వల్ల సారా తయారీని అరికట్టడం వీలవుతుందని చెప్పారు.

రామ్మోహన్‌రావుకు నివాళి

పాలకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్ఎంయూ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పి.రామ్మోహన్‌రావు వర్ధంతిని బుధవారం నిర్వహించారు.ఈసందర్భంగా రామ్మోహన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిపో సీసీఎస్ డెలిగేట్ ఎం.వైకుంఠం, నాయకులు నారాయణ, వై.నీలయ్య, బుడ్డయ్య, ఎంవీనాయుడు, ఎస్.డి.నాయుడు, డిపోచైర్మన్ మజ్జి సుబ్బారావు, గ్యారేజ్ కార్యదర్శి విజయరాం పాల్గొన్నారు.

పోలమాంబ ఆదాయం రూ.4.57 లక్షలు

మక్కువ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): శంబర పోలమాం బ అమ్మవారి ఆరో వారం జాతర ఆదాయం రూ.4 లక్షల 57 వేల 524 వచ్చినట్టు ఈవో వి.వి.సూర్యనారాయణ తెలిపారు. శీఘ్రదర్శనం టిక్కెట్ల ద్వారా రూ.ఒక లక్షా 35 వేల 500, ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారారూ.71,880, కేశఖండన ద్వారా రూ.5వేల80వచ్చినట్టు తెలిపారు. మహాన్నదానం విరాళాల ద్వారా 97 వేల 64, లడ్డూ ప్రసాదం విక్రయాలతో రూ.94 వేల 80, పులిహోరా ప్రసాదం ద్వారా 53 వేల 200 వచ్చినట్టు ఈవో చెప్పారు.

మర్రిపాడులో వైద్య శిబిరం

సీతంపేట రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మ ర్రిపాడు లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన క్రీడాకారులకు వాలీబాల్ కిట్లను పాలకొండ డీఎస్పీ రాంబాబు అందించారు. కార్య క్రమంలో పాలకొండ సీఐ చం ద్రమౌళి, ఎస్ఐ వై.అమ్మన్నరావు పాల్గొన్నారు.

ఆవిర్భావ వేడుకలు జయప్రదం చేయాలి

కురుపాం,మార్చి5(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జయప్రదం చేయాలని ఆ పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి వి.గంగులయ్య కోరారు. బుధవారం కురుపాం లో నియోజకవర్గం ఇన్‌చార్జి కద్రక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. కార్యక్రమంలో నిమ్మక నిబ్రహం, గర్భాన సత్తిబాబు పాల్గొన్నారు.